

దేవుడికే పంగనామాలు..!

ప్రజాశక్తి - కదిరి టౌన్

ఆలయానికి చెందిన ఆభరణాలు, వస్తువులను ఆలయ ఈవో రహస్యంగా తరలిస్తుండగా గ్రామస్తులు గమనించి అడ్డుకుని పోలీసులకు అప్పగించారు. కదిరి రూరల్ మండలంలో ఆదివారం జరిగిన ఈఘటనకు సంబందించిన వివరాలు... రూరల్ మండలం ఎర్రదొడ్డి గంగమ్మ ఆలయానికి చెందిన వెండి ఆభరణాలు, చీరలు, వస్తువులను ఆలయ ఈవో మురళీకృష్ణ ఆటోలో తీసుకెళ్తుండగా గమనించిన భక్తులు కదిరి రూరల్ అప్‌గ్రేడ్ పోలీసులకు సమాచారం అందించారు. దీంతో సిఐ నిరంజన్ రెడ్డి, ఆలయ అధికారి ప్రసాద్ అక్కడికి చేరుకుని ఆలయ ఈవోను అదుపులోకి తీసుకొని ఆటోతో పాటు స్టేషన్ కి తరలించారు. ఆలయానికి చెందిన సొమ్మును కాజేయాలని ప్రయత్నించిన ఈవోపై చర్యలు తీసుకోవాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. ఈయన శ్రావణమాసంలో అన్నదానానికి భక్తులు అందజేసిన విరాళాలకు రసీదులు ఇవ్వకుండా కాజేసినట్లు ఆరోపణలు వినపడుతున్నాయి. ప్రయివేటు వ్యక్తులను ఏర్పాటు చేసుకొని అక్రమాలకు పాల్పడినట్లు స్థానికులు ఆరోపిస్తున్నారు. అయితే ఈ వ్యవహారంలో నల్లచెరువు మండలానికి చెందిన ఒక వైసీపీ నేత కీలకంగా వ్యవహరించినట్టు తెలుస్తోంది.

పిఎబిఆర్ కుడికాలువకు గండి

పంటపొలాల్లోకి నీరు

ప్రజాశక్తి - అనంతపురం

కూడేరు మండల పరిధిలోని పీఏబీఆర్ కుడికాలువ 4వ కిలోమీటరు వద్ద జల్లిపల్లి గ్రామం సమీపాన శనివారం రాత్రి గండిపడింది. దీంతో నీరు పంటపొలాల్లోకి వెళ్లింది.గమనించిన గ్రామస్తులు హెచ్ఎల్‌సి అధికారులకు సమాచారమిచ్చారు. దీంతో అధికారులు పిఎబిఆర్ కుడికాలువకు ఉన్న గేట్లను మూసివేయడానికి ప్రయత్నించారు. అయితే గేట్లు స్తంభించిపోవటంతో పిఎబిఆర్ నుంచి నీటిని పెనకచెర్ల డ్యాం (ఎంపిఆర్)కు వదిలారు. దీంతో కుడికాలువకు నీటి ప్రవాహం తగ్గిపోయింది. ఈసందర్భంగా హెచ్ఎల్‌సి ఎఇ ఓబుళరెడ్డి మాట్లాడుతూ పిఎబిఆర్ నుంచి కుడి కాలువకు మూడు రోజుల నుండి నీరు విడుదల చేశామన్నారు. డ్యాం సమీపంలోని జల్లిపల్లి గ్రామం దగ్గర నాలుగు కిలోమీటర్ల దూరంలో కాలువకు గండిపడి రైతుల పంట పొలాల్లోకి నీరు వెళ్లిందన్నారు. నీటిని విడుదల చేసిన గేట్లు మొరాయించడంతో ఏటి కాలువ ద్వారా నీటిని పెనకచెర్ల డ్యాంకు విడుదల చేస్తున్నామన్నారు. మొరాయించిన గేట్లు రిపేర్ చేయడానికి సంబంధించిన ఇంజనీర్లు తుంగభద్ర డ్యాంనుంచి రావాల్సుందన్నారు. గేట్ల మరమ్మతుకు రెండు మూడు రోజులు అవుతుందని అన్నారు. గండిపడిన కుడి కాలువ మరమ్మతు పనులు త్వరతగతిన చేపట్టి నీటిని విడుదల చేస్తామని చెప్పారు.

ఆర్థికమంత్రి ఆరా : పిఎబిఆర్ కుడికాలువకు గండిపడిన విషయం తెలుసుకున్న ఆర్థిశాఖమంత్రి పయ్యావుల కేశవ్ కలెక్టర్ ఓ. ఆనంద్‌తో మాట్లాడారు. గండిపడిన చోట వెంటనే మరమ్మతులు చేపట్టాలని ఆదేశించారు. అలాగే రైతుల నీట మునిటిన పంటపొలాలను పరిశీలించి పంట నష్టం అంచనా వేయాలని చెప్పారు.

గండిని పూడ్చి నీటిని విడుదల చేయాలి : పిఎబిఆర్ కుడికాలువకు పడిన గండిని వెంటనే పూడ్చివేసి కాలువ మరమ్మతు చేసి నీటిని విడుదల చేయాలని వైసిపి నియోజకవర్గ నాయకులు, వైసిపి రాష్ట్ర విద్యార్థివిభాగం జోనల్ ఇన్‌ఛార్జి ప్రణయ్‌రెడ్డి కోరారు. ఈసందర్భంగా ఆయన ఆదివారం గండిపడిన ప్రదేశాన్ని పరిశీలించారు. కుడి కాలువ కింద 49 చెరువులు ఉన్నాయని,ఆ చెరువులకు పూర్తిస్థాయిలో నీరు చేరాలంటే కాలువకు గండ్లు పడకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. జల్లిపల్లి వద్ద కుడి కాలువకు గండిపడి పెద్ద ఎత్తున నీరంతా రైతుల పొలాల్లోకి ప్రవహించిందన్నారు. దీంతో వరి, వేరుశనగ, చీని పంట దెబ్బతిని రైతులు తీవ్రంగా నష్టపోయారన్నారు. రైతులకు పరిహారం చెల్లించాలని కోరారు.



పిఎబిఆర్ కుడికాలువకు గండి పడటంతో నీరు వృథాగా వెళుతున్న దృశ్యం

తుంగభద్ర ఎగువ కాలువకు గండి

ప్రజాశక్తి - రాయదుర్గం/బొమ్మనహాల్

అనంతపురం జిల్లా డి. హీరేహాల్, బొమ్మనహాల్ మండలాల పరిధిలో ఉన్న తుంగభద్ర ఎగువ కాలువ 113 / 557 కిలోమీటర్ వద్ద ఆదివారం ఉదయం గండిపడింది. దీంతో పెద్ద ఎత్తున నీరు అండర్ టన్నల్ ద్వారా దిగువన వెళు తున్నాయి. కాలువ అండర్ టర్నల్ సైడ్ వాల్ దెబ్బతిని కూలడంతో కాలువకు గండి పడింది. దీంతో స్థానిక రైతులు తుంగభద్ర ఎగువ కాలువ అధికారులకు సమాచారం అందించారు. ఎగువ కాలువ గట్లు పలుచోట్ల బలహీనంగా ఉండటంతో తరచూ గండ్లు పడుతున్నాయి. నీరు పెద్ద ఎత్తున వృథా కావడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. వెంటనే గండిని పూడ్చాలని, బలహీనంగా ఉన్న చోట గట్టుకు మరమ్మతులు చేపట్టాలని రైతులు కోరుతున్నారు. తుంగభద్ర ఎగువ కాలువ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ మద్దిలేటి, డిఇ దివాకర్‌రెడ్డి, అసిస్టెంట్ ఇంజనీర్ అల్తాఫ్ సిబ్బందితోపాటు గండి పడిన చోటుకి చేరుకొని నీరు వృథా కాకుండా మరమ్మతులు చేపట్టారు. ఎస్కేప్ వద్ద నీటిని బయటికి వదిలి నీటి మట్టం తగ్గిన తర్వాత మరమ్మతులు చేయడం జరుగుతుందని హెచ్ఎల్‌సి డిఇ తెలిపారు.



హెచ్ఎల్‌సి కాలువ తెగిన దృశ్యం

ప్రాణాలు తోడేస్తున్న కొత్త పురుగు

వైరల్ జ్వరాలకు తోడు టైఫస్ భయం
భయపడుతున్న జిల్లా వాసులు
అప్రమత్తమైన వైద్య ఆరోగ్య శాఖ

ప్రజాశక్తి - హిందూపురం



స్క్రబ్ టైఫస్ జిల్లా వాసులను భయపెడుతోంది. జ్వరమొస్తే చాలు జనం వణికిపోతున్నారు. శరీరంపై చిన్న దద్దు వచ్చినా ప్రైవేటు ఆస్పత్రులకు పరుగులు తీస్తున్నారు. స్క్రబ్ టైఫస్ కేసులు పెరుగుతుండటం ప్రజల్లో ఆందోళన కలిగిస్తోంది. హిందూపురం మండలంతో పాటు చిలమత్తూరు మండల పరిధిలో కేసులు నమోదు అవుతున్నాయి. ఇతర జిల్లాల్లో ఈ వ్యాధి బారిన పడి పలువురు మృతిచెందడంతో ప్రభుత్వం ఆరోగ్య విభాగాన్ని అప్రమత్తం చేసింది. ఈ నేపథ్యంలో ప్రజలు తెలుసుకోవాల్సిన అంశాలు, జాగ్రత్తలు, నివారణ చర్యలు ఎంతో కీలకం

టైఫస్ భయం వణికిస్తోంది. ఇప్పటికే ఆరు పాజి టివ్ కేసులు నమోదుకావడంతో జ్వరం వచ్చిన జనం భయపడిపోతున్నారు. వివిధ రకాల విషజ్వ రాల మాదిరిగా ఇది కూడా ఓ రకం జ్వరమే అయినప్పటికీ, ఈ జ్వరాన్ని నిర్లక్ష్యం చేస్తే ప్రాణాలు పోయే ప్రమాదం ఉందని వైద్యులు హెచ్చరిస్తున్నారు. దట్టమైన చెట్లు, వ్యవసాయ భూములుండే ప్రాంతాల్లో నివసిస్తున్న వారికి ఈ వ్యాధి సోకే ప్రమాదం ఉందని తేలింది.

బ్యాక్టీరియా వల్ల వచ్చే వ్యాధి..

స్క్రబ్ టైఫస్ అనేది 'ఒరియంటియా సూసుగముషి' అనే బ్యాక్టీరియా వల్ల వచ్చే వ్యాధి. పొదలు, పచ్చిక బయళ్లలో ఉండే నల్లులు (చిగర్ మైట్స్) ద్వారా మనుషులకు వ్యాపిస్తుంది. పరిమాణంలో చిన్నగా ఉండే నల్లులు మనిషికి తెలియకుండానే కాటు వేస్తాయి. అప్పుడు ఒరియంటియా సూసుగముషి బ్యాక్టీరియా మనిషి శరీరంలోకి ప్రవేశించడంతో ఈ స్క్రబ్ టైఫస్ ఇన్ఫెక్షన్ వస్తుంది.

వ్యాధి లక్షణాలు..

వ్యాధి సోకిన వారికి తీవ్రమైన జ్వరం, తలనొప్పి, ఒంటి నొప్పులు, వాంతులు, పొడిదగ్గు, నీరసం, కుట్టిన చోట నల్లటి మచ్చలు, దద్దుర్లు ఉంటాయి. వ్యాధి ముదిరితే కామెర్లు, ఫీట్స్ లక్షణాలు కనిపిస్తాయి. ఊపిరితిత్తులు దెబ్బతింటాయి. అప్పటికీ చికిత్స తీసుకోక పోతే కిడ్నీలు ఫెయిల్యూర్ కావడం, హృదయకండరాల వాపు, సెప్టిక్ షాక్, అంతర్గత రక్తస్రావం, తెల్లరక్త కణాలు తగ్గడం వంటి సమస్యలు వస్తాయి. కొంత మందికి కాలేయం, మూత్ర పిండాల పనితీరు అసాధారణ స్థితికి చేరుకునే ప్రమాదం ఉంటుంది. చికిత్స ఆలస్యమైతే మరణాలు కూడా సంభవిస్తాయని వైద్యులు చెబుతున్నారు. అందువల్ల లక్షణాలు కనిపించిన వెంటనే చికిత్స తీసుకుంటే కోలుకునే అవకాశాలు ఎక్కువగా ఉంటాయంటున్నారు.

జాగ్రత్తలు పాటించాలి..

స్క్రబ్ టైఫస్ ఎక్కువగా గ్రామీణ ప్రాంతాల్లో, పొలాల్లో పనిచేసే వారు, పశువుల కాపరులకు, తేమ ఎక్కువ ఉన్న ప్రదేశాల్లో, దట్టమైన పొదలు ఉన్న ప్రాంతాల్లో నివసించే వారికి సోకే ప్రమాదం ఉంది. ప్రజలు జాగ్రత్తలు తీసుకోవడం వల్ల స్క్రబ్ టైఫస్ బారిన పడకుండా ఉండవచ్చు. పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవడంతో పాటు నల్లులు పెరిగే వాతావరణాన్ని నివారించాలి. ఇళ్లలో దోమతెరలు వాడాలి. అలాగే నేలపై పడుకోవడం, కూర్చోవడం చేయరాదు..

అందుబాటులో లేని పరీక్షా కేంద్రాలు..

జిల్లాలో ఈ ఏడాది జనవరి నుంచి స్క్రబ్ టైఫస్ కేసులు నమోదవుతున్నాయి. ఇప్పటి వరకూ హిందూపురంలో 3, ధర్మవరంలో 2, ఎన్‌పి కుంట 1, అమడగూరులో 1 చొప్పున మొత్తం 7 పాజిటివ్ కేసులు నమోదయ్యాయి. ఆదివారం హిందూపురం జిల్లా అసుపత్రికి మరో ఇద్దరు ఇదే లక్షణాలతో వచ్చారు. అయితే పరీక్షలు నిర్వహించడంతో నెగటీవ్‌గా తేలింది. రోజు రోజుకు కేసుల సంఖ్య పెరుగుతున్నప్పటికి పూర్తి స్థాయిలో పరీక్ష కేంద్రాలను వైద్య ఆరోగ్య శాఖ ఏర్పాటు చేయలేదు. ప్రజల్లో పూర్తి స్థాయిలో అవగాహన సైతం కల్పించడం లేదు.

స్క్రబ్ టైఫస్ వ్యాధిపై ఆందోళన వద్దు : డిఎంహెచ్ఒ

స్క్రబ్ టైఫస్ వ్యాధి పట్ల ప్రజలు ఆందోళన చెందవద్దని జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారిణి ఫైరోజా బేగం అన్నారు. వ్యాధికి అవసరమైన చికిత్స అందుబాటులో ఉందని, ప్రజలు నిర్భయంగా ఉండవచ్చునని అన్నారు. స్క్రబ్ టైఫస్ ఒకరకమైన బ్యాక్టీరియా వల్ల సంక్రమించే వ్యాధిఅని జిల్లాలో ఈ ఏడాది ఇప్పటి వరకు 6 పాజిటివ్ కేసులు నమోదయ్యాయని చెప్పారు. ఒక్క మరణం కూడా సంభవించలేదన్నారు. ప్రజలందరూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. హిందూపురం జిల్లా అసుపత్రికి టైఫస్ అనుమానిత కేసులు వచ్చాయని చెప్పారు. దీంతో బాధితుల నుంచి నమూనాలు సేకరించి, 10 పడకలతో ప్రత్యేక వార్డును ఏర్పాటు చేశామని వివరించారు. ఇప్పటికే ముగ్గురు చిన్నారులను అనుమానిత కేసులుగా నమోదు చేసి చికిత్సలు అందిస్తున్నామన్నామని వీరందరూ కోలుకుంటున్నారని చెప్పారు.

అలరించిన కవి సమ్మేళనం

ప్రజాశక్తి-హిందూపురం

హిందూపురం పట్టణంలోని చిన్మయ పాఠశాలలో నిర్వహించిన కవి సమ్మేళనం, సంగీత విభావరి అలరించింది. మండల విద్యాధికారి డాక్టర్ ఎహెచ్ గంగప్ప ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ వ్యక్తిగత కార్యదర్శి వీరయ్య పాల్గొన్నారు. అనంతపురం, కుప్పం, చిత్తూరు వివిధ ప్రాంతాల నుండి విచ్చేసిన కవులు తమ తమ కవితలను వెలిబుచ్చారు. సంగీత విభావరిలో కళాకారులు పాటలు పాడారు. హిందూపురం ఎంఈఓ గంగప్ప, కనగాలపల్లి ఎంఈఓ శ్రీదేవి, మలుగూరు ఉన్నత పాఠశాల హెచ్ఎం పద్మావతి, ఏఎస్ఐ మల్లేష్, శేఖర్ అకాడమీ శేఖర్ విద్యార్థులు పాటలు పాడారు. అభినవ అంబేద్కర్ గా తెలుగు పండితులు లక్ష్మీనారాయణ వేషధారణ ఎంతో ఆకట్టుకుంది. అదేవిధంగా వైష్ణవి శివతాండవం నృత్యం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. స్వాగతం పాటకు పాంచజన్య పాఠశాల విద్యార్థుల భరతనాట్యం అలరించింది. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ డిఈ రమేష్ కుమార్, పాంచజన్య పాఠశాల అధ్యక్షులు పాంజన్య శ్రీనివాసులు, అల్ ఆమీన్ స్కూల్ రీయాజ్, రెనౌల్డ్ పాఠశాల అధ్యక్షులు ముస్తఫా ఆలి ఖాన్, ఉమర్ ఫరూక్ ఖాన్, కవులు నాగిరెడ్డి, ఆది, కుంచె శ్రీ, రఘురామయ్య, మనోహర్, లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.



కళాకారిణికి జ్ఞాపికను అందిస్తున్న వీరయ్య, చిత్రంలో పాంచజన్య శ్రీనివాసులు తదితరులు

నీటి సంపులో పడి అన్నదమ్ములు మృతి

ప్రజాశక్తి - బ్రహ్మసముద్రం

అనంతపురం జిల్లా బ్రహ్మసముద్రం మండలం పాలవెంకటాపురం గ్రామంలో వ్యవసాయ నీటిసంపులో పడి అన్నదమ్ములైన ఇద్దరు యువకులు మృతిచెందారు. ఆదివారం జరిగిన ఈ ఘటనకు సంబందించి బాధితులు, పోలీసులు, గ్రామస్తులు తెలిపిన వివరాలు... కళ్యాణదుర్గం పట్టణం వాల్మీకి సర్కిల్ బోయ వీధి (సౌత్ స్కూల్ వీధి) శెట్టూరు రోడ్డు లో నివాసమున్న నికి చెందిన తలారి వెంకటేశులు వరుసకు తమ్ముడైన రాము పాల వెంకటాపురం గ్రామంలోని అమర శేషు వీరారెడ్డికి చెందిన మామిడితోటను రెండేళ్లకు రూ.20 లక్షలకు కౌలు(గుత్త)కు తీసుకుని పంటసాగు చేశారు. ఈ నేపథ్యంలో వీరు ఆదివారం ఉదయం మామిడిచెట్లకు ట్రాక్టర్ సాయంతో మందు పిచికారీ చేయిస్తున్నారు. కొద్దిసేపటికి పిచికారీ చేసే ఫర్టిలైజర్ మందుల కొరత ఏర్పడటంతో వెంకటేశు కళ్యాణదుర్గంలోని తన ఇంటిలోకి కుమారులకు ఫోన్ చేశాడు. ఫర్టిలైజర్ దుకాణంలో మందులు కొనుగోలు చేసి తీసుకుని రావాలని చెప్పాడు. దీంతో వెంకటేశు కుమారులు నరేంద్ర ఆలియాస్ నాని (25), చరణ్ ఆలియాస్ చిన్న (18) కళ్యాణదుర్గంలో మందులు కొనుగోలు చేసి ద్విచక్రవాహనంలో పాలవెంకటాపురానికి వెళ్లారు. మందులు తన తండ్రికి ఇచ్చారు. అదే సమయంలో అదే తోటలో ఉన్న నీటిసంపు దగ్గరకు వెళ్లారు. సంపులో నీరు తక్కువగా ఉన్నాయని భావించిన చరణ్ అందులోకి దిగాడు. ఈత రాకపోవటంతో నీటిలో మునిగిపోతుండగా గమనించిన సోదరుడు నరేంద్ర తనకు ఈత రాకపోయినా తమ్ముడిని రక్షించేందుకు సంపులోకి దూకాడు. ఇద్దరికీ ఈత రాకపోవటంతో నీటిలో మునిగిపోయారు. తన కుమారులు కన్పించకపోవటంతో కంగారుపడిన వెంకటేశులు సంపుదగ్గరకు పరుగున వెళ్లాడు. అయితే అప్పటికే నీటిలో మునిగిపోయిన నరేంద్ర, చరణ్ మృతిచెందారు. నరేంద్రకు ఆరు నెలల క్రితమే వివాహం అయిందని, ప్రస్తుతం పట్టణంలో స్లాబులకు కడ్డీలను కట్టే కూలి పనులకు వెళ్లేవాడని కుటుంబసభ్యులు తెలిపారు. చరణ్ ఇంటర్ ఫెయిల్ అయ్యి పట్టణంలో తైవాన్ పంపుల రిపేరీ మెకానిక్‌గా పని చేస్తున్నాడని అన్నారు. చేతికొచ్చిన కుమారులిద్దరూ మృతిచెందడంతో తండ్రి వెంకటేశులు, వారి కుటుంబసభ్యులు చేసిన రోదనలు చూపరులను కంటతడి పెట్టించాయి.

ఎమ్మెల్యే దిగ్భ్రాంతి : బ్రహ్మసముద్రం మండలం పాలవెంకటాపురం వ్యవసాయ తోటలో నీటిసంపులో పడి ఇద్దరు యువకులు మృతిచెందడంపై స్థానిక ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు దిగ్భ్రాంతి వ్యక్తం చేశాడు. మృతుల కుటుంబానికి అండగా ఉంటామని అన్నారు.క్తిగత సహాయకులు తెలిపారు.



నరేంద్ర, చరణ్ మృతదేహాలు



నరేంద్ర (ఫైల్‌ఫొటో)



చరణ్ (ఫైల్‌ఫొటో)

సీనియర్ జర్నలిస్టు కాలవ రమణకు నివాళి

ప్రజాశక్తి-హిందూపురం

హిందూపురం పట్టణానికి చెందిన సీనియర్ పాత్రికేయులు కాలవ రమణకు ఆదివారం ప్రెస్ క్లబ్ లో ఘనంగా నివాళులర్పించారు. కాలవ రమణ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. ఈ సందర్భంగా ఆదివారం జరిగిన సంతాప సభలో పాత్రికేయులు కాలవ రమణ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.కాలవ రమణ 30 ఏళ్ల పాటు అందించిన సేవలను సీనియర్ పాత్రికేయులు కొనియాడారు. ఈ కార్యక్రమంలో ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా పాత్రికేయులు పాల్గొన్నారు.



రమణ చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న పాత్రికేయులు

క్రీడలను ప్రోత్సహించడం అభినందనీయం

ప్రజాశక్తి-హిందూపురం

క్రీడలు, క్రీడాకారులను ప్రోత్సహించేందుకు చౌళూరు యువకులు ముందుకు రావడం అభినందనీయమని వక్తలు పేర్కొన్నారు. ఆదివారం హిందూపురం రూరల్ మండల పరిధిలోని చౌళూరు ప్రభుత్వ పాఠశాల ఆవరణలో యువ నాయకులు పి.బి. ప్రసన్న, పీబి మనీష్ కుమార్ ఆధ్వర్యంలో వాలీబాల్ టోర్నమెంట్ నిర్వహించారు. ఈ సందర్భంగా పాల్గొన్న జట్ల మధ్య పోటీలను నిర్వహించారు. అనంతరం టోర్నమెంట్ విజేత జట్టుకు రూ. 6666, ద్వితీయ స్థానంలో నిలిచిన జట్టుకు రూ.4444, తృతీయ స్థానంలో నిలిచిన జట్టుకు రూ.2222 నగదు బహుమతి అందజేశారు. ఈ కార్యక్రమంలో చౌళూరు గ్రామ పెద్దలు, యువకులు, క్రీడాకారులు పాల్గొన్నారు.



క్రీడా పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

గ్రామ పంచాయతీలను ఆదర్శంగా తీర్చిదిద్దుతాం

జిల్లా పంచాయతీ అధికారి సమత

ప్రజాశక్తి - పుట్టపర్తి రూరల్



శ్రీ సత్య సాయి జిల్లాలోని గ్రామ పంచాయతీలను అభివృద్ధి పరచి వాటిని ఆదర్శ పంచాయతీలుగా తీర్చి దిద్దాలన్నదే తమ ధ్యేయమని, అందుకోసం అన్ని చర్యలు చేపడుతున్నామని శ్రీ సత్య సాయి జిల్లా పంచాయతీ అధికారి సమత పేర్కొన్నారు. ఈ మేరకు ఆమె ఆదివారం ప్రజాశక్తికి ఇచ్చిన ప్రత్యేక ఇంటర్వ్యూలో పలు విషయాలను వెల్లడించారు.

ప్రశ్న : పుట్టపర్తి పంచాయతీ అభివృద్ధికి ఇటీవల నిధులు మంజూరు చేశారు. వాటి ద్వారా ఏయే పనులు నిర్వహిస్తున్నారు?

డిపిఒ: ప్రభుత్వం ఇటీవల చేపట్టిన స్వచ్ఛ ఆంధ్ర స్వచ్ఛ దివస్ కార్యక్రమంలో భాగంగా గ్రామ పంచాయతీల్లో ప్రభుత్వ కార్యాలయాలు నివాస ప్రాంతాలు మునిసిపాలిటీలు ఆసుపత్రులు బస్టాండ్లు రైల్వేస్టేషన్లో శుభ్రపరిచే విధంగా చర్యలు చేపడుతున్నాం. ప్రతి మూడవ శనివారం ఈ కార్యక్రమాన్ని చేపట్టే విధంగా చర్యలు చేపడుతున్నాం. రహదారులు వెంబడి పిచ్చి మొక్కలు, వ్యర్థాలను తొలగించి, తాగునీటి వసతి లాంటి పనులను చేపట్టాము. జిల్లా వ్యాప్తంగా ఆయా పంచాయతీల్లో సిసి రోడ్లు నిర్మాణం వచ్చిన నిధులకు సరిపడా సీసీ రోడ్లు డ్రైనేజీలు పనులు పూర్తి అయ్యాయి.

ప్రశ్న : సంపద సృష్టి కేంద్రాల నిర్వహణ ఏ విధంగా ఉంది?

డిపిఒ: జిల్లా వ్యాప్తంగా సాలిడ్ వేస్ట్ ప్రాసెసింగ్ సెంటర్లు 421 ఉన్నాయి. వాటి వలన కార్మికులు గ్రామంలో సేకరించిన తడి చెత్త, పొడి చెత్తను వేర్వేరు చేసి, వాటిలో వానపాములను వదిలి ఎరువుగా తయారు చేసి ఆ ఎరువును రైతులకు కిలో 40 రూపాయలు చొప్పున అమ్మి దాని ద్వారా పంచాయతీకి ఆదాయం వచ్చే విధంగా చర్యలు చేపడతారు. పంచాయతీలలో ఇంటింటికి తిరిగి చెత్తను సేకరించడం, వీధులను శుభ్రం చేయడం వలన, పంచాయతీ పరిశుభ్రంగా ఉండటమే కాక , చెత్త ద్వారా సేకరించిన ప్లాస్టిక్ బాటిల్ ,ఇనుము ముక్కలు, సిల్వర్ తదితర వస్తువుల ద్వారా పంచాయతీలకు కొంత ఆదాయం లభిస్తుంది. ప్లాస్టిక్ వినియోగంపై ప్రజలకు అవగాహన కల్పించి ప్లాస్టిక్ రహిత జిల్లాగా తీర్చిదిద్దడానికి చర్యలు చేపడుతున్నాం. పంచాయతీలలో, మున్సిపాలిటీలలో ప్లాస్టిక్ వాడకంపై నిషేధం పై ప్రజలకు అవగాహన కల్పించి అమలు జరిగే విధంగా చర్యలు చేపడుతాం.

ప్ర : పంచాయతీ అప్ గ్రేడ్ లపై మీ అభిప్రాయం ?

జవాబు :కూటమి ప్రభుత్వం పంచాయతీల అభివృద్ధి, సౌలభ్యం కోసం ప్రస్తుతం ఉన్న ఐదు గ్రేడ్లను ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ మూడు గ్రేడ్లుగా మార్చి అధికారులకు ఊరట కలిగించారు. దీనివలన పంచాయతీ కార్యదర్శులకు ఊరట కలగనుంది. గత పది సంవత్సరాల నుండి గ్రేడ్ 4 పంచాయతీ కార్యదర్శులుగా ఉన్న ఉద్యోగస్తులు గ్రేడ్ 2 లోకి వస్తారు. దాని వలన ఉద్యోగస్తులకు ఊరట కలుగుతుంది. అదేవిధంగా పంచాయతీ కార్యదర్శి కాకుండా పిడిఓగా (పంచాయతీ డెవలప్మెంట్ ఆఫీసర్)పేరు మార్పు పై ఉద్యోగస్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ప్ర : జిల్లావ్యాప్తంగా పంచాయతీలు ఏయే అభివృద్ధి పనులు చేపడుతున్నారు? ఎంత నిధులు మంజూరు అయ్యాయి?

డిపిఒ: శ్రీ సత్య సాయి జిల్లా వ్యాప్తంగా ఉన్న పంచాయతీలలో డ్రైనేజీ, సిమెంట్ రోడ్లు, గ్రామంలో తాగునీటి సమస్య, వీధిలైట్లు ఏర్పాటు, రోడ్లు మరమ్మతులకు మొదటి ప్రాధాన్యత నిస్తున్నాం. కూటమి ప్రభుత్వం నుండి పంచాయతీలకు 2024 –25 సంవత్సరానికి గాను 15వ ఆర్థిక నిధులు క్రింద శ్రీ సత్య సాయి జిల్లాకు రూ.60 కోట్లు జిల్లా వ్యాప్తంగా ఉన్న పంచాయతీల ఖాతాల్లోకి జమ కావడం జరిగింది. ఈ నిధుల ద్వారా పంచాయతీలలో అభివృద్ధి పనులను సక్రమంగా జరిగే విధంగా డిఎల్‌పిఒలకు, ఈవోఆర్డీలకు సూచనలు ఇచ్చాం.

ప్ర : సత్యసాయి జయంతి సందర్భంగా ఎలాంటి అభివద్ధి పనులు నిర్వహించారు ?

డిపిఒ: శ్రీ సత్య సాయి శత జయంతి ఉత్సవాల సందర్భంగా పుట్టపర్తి, బుక్కపట్నం, కొత్తచెరువు, పంచాయతీలలో శానిటేషన్ పనులు, రోడ్డు మరమ్మతు పనులు, రోడ్డు శుభ్రత పరిశుభ్రత పనులు నిర్వహించారు. పుట్టపర్తిలో రైల్వే స్టేషన్ వద్ద నుండి పుట్టపర్తి లోని గణేష్ సర్కిల్ వరకు ఎల్ఇడి లైట్ల పరిశీలన, రోడ్లు ఇరువైపులా శుభ్రం చేయడం వాటి పరిశీలన, తాగునీరు ఏర్పాటు, శానిటేషన్ పనులు, నిర్వహించాం. సత్యసాయి జయంతి ఉత్సవాలు ప్రారంభమైన నాటి నుండి జిల్లా వ్యాప్తంగా ఉన్న అధికారులు. కార్మికులు 15 రోజులు పాటు ఏర్పాట్లలో నిమగ్నమై సత్య సాయి జయంతి ఉత్సవాలను ఎలాంటి సమస్యలు లేకుండా ముగిసేందుకు అధికారులు ,కార్మికులు కృషి చేశారు. ఇందుకు జిల్లా కలెక్టరు, ఎస్పీ, ఎమ్మెల్యే, ప్రజా ప్రతినిధులు సహకారం ఎంతో ఉంది.



డిపిఒ సమత

నేడు మడకశిరలో క్రికెటర్ దీపికకు సన్మానం

ప్రజాశక్తి-మడకశిర టౌన్

అంధుల టీ-20 క్రికెట్ వరల్డ్ కప్ గెలిచిన జట్టు కెప్టెన్ దీపికను సోమవారం మడకశిర పట్టణంలో సన్మానించనున్నారు. ఆ ఏర్పాట్లను ఆదివారం ఎమ్మెల్యే ఎంఎస్.రాజు దగ్గరుండి పర్యవేక్షిం చారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మంత్రి సవిత, కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్, ఎస్పీ ఎస్.సతీష్ కుమార్, ఆర్‌డిటి సంస్థ ప్రోగ్రాం డైరెక్టర్ మాంచూ ఫెర్రర్, ఎమ్మెల్యేలు పల్లె సింధూరరెడ్డి, బండారు శ్రావణిశ్రీ, ప్రముఖ సినీ నటులు సాయి కుమార్ హాజరవుతున్నట్లు తెలిపారు. ముందుగా పట్టణంలోని వాల్మీకి సర్కిల్ నుంచి జూనియర్ కళాశాల వరకూ భారీ ర్యాలీ నిర్వహిస్తారు. అనంతరం ప్రభుత్వ జూనియర్ కళాశాల క్రీడా మైదానంలో భారీ బహిరంగ సభ, సన్మాన కార్యక్రమాలు ఉంటాయి. కార్యక్రమంలో ప్రభుత్వ డిగ్రీ, జూనియర్ కళాశాలలతో పాటు ప్రయివేట్ కళాశాలల విద్యార్థులు 6వేల మంది దాకా పాల్గొననున్నట్లు తెలిపారు.


అంధుల టీ-20 క్రికెట్ వరల్డ్ కప్‌తో దీపిక

గుడిబండ : అమరాపురం మండలం హేమావతి పంచాయతీ తంబాలహట్టి గ్రామానికి చెందిన దీపిక అంధ మహిళల టీ-20 క్రికెట్ వరల్డ్ కప్ భారత జట్టుకు సారథిగా వహించి అద్భుత విజయాన్ని అందించింది. ఆమెను సోమవారం మడకశిర పట్టణంలో సన్మానించను న్నారు. కార్యక్రమంలో నియోజకవర్గంలోని కూటమి నాయకులు, కార్యకర్తలు, విద్యార్థులు, ఉద్యోగులు, క్రీడాభిమానులు పెద్దఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని టిడిపి మండల కన్వీనర్ లక్ష్మీనరసప్ప, ప్రధాన కార్యదర్శి శ్రీనాథ్, సింగిల్ విండో అధ్యక్షులు మద్దనకుంటప్ప, బాలేపల్లి రాజు, చిత్రశేఖర్‌యాదవ్ కోరారు.

ముఖ్యఅతిథిగా హాజరవనున్న ప్రముఖులు
ఏర్పాట్లను పర్యవేక్షించిన ఎమ్మెల్యే


జూనియర్ కళాశాల క్రీడా మైదానంలో ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే రాజు

అగళి : ప్రపంచ స్థాయిలో భారత దేశ సత్తా చాటిన క్రికెటర్ దీపిక సన్మాన కార్యక్రమంలో మండలం నుంచి టిడిపి నాయకులు, కార్యకర్తలు, క్రీడాకారులు, ప్రజలు పెద్దఎత్తున పాల్గొని విజయ వంతం చేయాలని జడ్పిటిసి ఉమేష్, సింగిల్‌విండో అధ్యక్షులు కుమారస్వామి, టిడిపి మండల కన్వీనర్ తిప్పేస్వామి కోరారు. దీపిక అమరాపురం మండలం హేమావతి గ్రామపంచాయతీ పరిధిలోని తంబాలహట్టి గ్రామంలో ఓ నిరుపేద కుటుంబంలో జన్మించారన్నారు. ఆమె అంధ మహిళల టీ-20 క్రికెట్ వరల్డ్ కప్‌లో భారత జట్టుకు సారథ్యం వహించడం నియోజకవర్గానికి ఎంతో గర్వకారణమన్నారు. యువతకు ఆమె స్ఫూర్తిదాయకం అన్నారు.

ధాన్యం తరలింపులో వ్యాపారుల నిర్లక్ష్యం..!

కనీస జాగ్రత్తలు పాటించని వైనం

ప్రజాశక్తి-రొద్దం

మండలంలో రైతుల నుంచి కొనుగోలు చేసిన ధాన్యాన్ని తరలించడంలో వ్యాపారులు కనీస జాగ్రత్తలు పాటించడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. మండలంలోని ప్రధాన రహదారిపై వ్యాపారులు అత్యంత ప్రమాదకర పరిస్థితుల్లో ధాన్యం తరలిస్తున్నట్లు పలువురు పేర్కొంటున్నారు. ప్రధానంగా పెనుకొండ-పావడ ప్రధాన రహదారిలో ట్రాక్టర్లలో పరిమితికి మించి అధిక లోడుతో మొక్కజొన్న ధాన్యం సంచులు రవాణా చేస్తున్నారు. సంచులు కింద పడిపో కుండా కనీసం తాడు బిగించకుండా తరలిస్తుండడంతో చూసే వారు ముక్కున వేలేసుకుంటున్నారు. స్పీడ్ బ్రేకర్లు, గుంతల వద్ద వాహనం అటు ఇటూ ఊగిగే ధాన్యం సంచులు జారి కింద పడే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని పలువురు మండిపడుతున్నారు. సంచులు రోడ్డుపై కానీ, వాహనాలపై కానీ పడితే ప్రమాదాలు జరిగే అవకాశాలు ఉన్నాయి. మండలంలోని పలువురు వ్యాపారులు ప్రతి రోజూ ఈ విధంగానే ధాన్యం సంచులు రవాణా చేస్తున్నట్లు తెలుస్తోంది. దీనికి తోడు వాహనంపై కూలీలు కూర్చుని ప్రయాణించడం చాలా ప్రమాదకరం. ఇకనైనా సంబంధిత అధికారులు స్పందించి ఎలాంటి ప్రమాదం జరగకముందే చర్యలు తీసుకోవాలని మండల ప్రజలు కోరుతున్నారు.

కనీసం తాడు కూడా కట్టకుండా ధాన్యం తరలిస్తున్న వ్యాపారులు


నేడు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక : కలెక్టర్

ప్రజాశక్తి-పుట్టపర్తి రూరల్:

జిల్లా కేంద్రంతో పాటు మండల, డివిజన్ కేంద్రాలు, మున్సిపల్ కార్యాలయాల్లో సోమవారం ఉదయం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం ద్వారా ప్రజల నుంచి విజ్ఞప్తులు స్వీకరించనున్నట్లు కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ప్రజలు కలెక్టరేట్‌కు వచ్చే అవసరం లేకుండా 'meekosam.ap.gov.inలో ఆన్‌లైన్ ద్వారా కూడా ఫిర్యాదు చేయవచ్చన్నారు. దరఖాస్తు పరిష్కారం కాకపోయినా, పరిష్కారం ఏ దశలో ఉందో తెలుసుకోవాలన్నా ఏదైనా సమాచారం ఆన్‌లైన్‌లో తెలుస్తుందన్నారు. లేదా టోల్ ఫ్రీ నెంబర్ 1100ను సంప్రదించి తెలుసుకోవచు అన్నారు. అర్జీదారులు తమ అర్జీలను సంబంధిత మండల, డివిజన్, మున్సిపాలిటీల్లో అధికారులకు ఇవ్వాలని కలెక్టర్ సూచించారు. మండల, డివిజన్ స్థాయిలో సమస్యలు పరిష్కారం కాని అర్జీదారులే జిల్లా కేంద్రంలో జరిగే ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి రావాలని తెలిపారు. కలెక్టరేట్‌లో జరిగే పిజిఆర్ఎస్ కార్యక్రమానికి జిల్లా అధికారులందరూ తప్పనిసరిగా హాజరుకావాలని కలెక్టర్ ఆదేశించారు.

సిఐటియు జాతీయ మహాసభలను జయప్రదం చేద్దాం

ప్రజాశక్తి-పుట్టపర్తి రూరల్


సమావేశంలో మాట్లాడుతున్న సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు ఓబులు

విశాఖపట్నంలో ఈ నెల 31 నుంచి జనవరి 4వ తేదీ వరకూ నిర్వహిస్తున్న సిఐటియు 18వ జాతీయ మహాసభలను విజయవంతం చేద్దామని సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు జి.ఓబులు, జిల్లా అధ్యక్షులు జడ్పీ శ్రీనివాసులు, సిఐటియు జిల్లా కార్యదర్శి పైపల్లి గంగాధర్ పిలుపునిచ్చారు. పట్టణంలోని సిఐటియు కార్యాలయంలో ఆదివారం అంగన్వాడీ యూనియన్ నాయకురాలు పద్మావతి అధ్యక్షతన సిఐటియు, అంగన్వాడీ జిల్లా కమిటీ సమావేశం నిర్వహించారు. ముఖ్యఅతిథులుగా హాజరైన వారు మాట్లాడుతూ మహాసభలో ప్రధాన అజెండా అంశాలుగా లేబర్ కోడ్‌ల రద్దు, కార్మిక సంక్షేమ బోర్డు పునరుద్ధరణ, గంజాయి, డ్రగ్స్, మద్యం పూర్తి స్థాయిలో రద్దు, తదితర వాటిపై చర్చిస్తారని తెలిపారు. ఆఖరి రోజైన జనవరి 4వ తేదీ భారీ బహిరంగ సభ జరుగుతుందని, జిల్లా నుంచి సంఘటిత, అసంఘటిత రంగ కార్మికులు అధిక సంఖ్యలో తరలివెళ్లి పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో అంగన్వాడీ జిల్లా కార్యదర్శి శ్రీదేవి, సుజాత, రమాదేవి, మణిమాల, బావమ్మ, సుజాత, లక్ష్మీదేవి, అంగన్వాడీ యూనియన్ నాయకురాళ్లు, తదితరులు పాల్గొన్నారు.

'పది' పరీక్ష ఫీజు చెల్లించండి : డిఇఒ

ప్రజాశక్తి-కొత్తచెరువు

2025-26 విద్యా సంవత్సరానికి సంబంధించి మార్చిలో జరిగే పదో తరగతి పబ్లిక్ పరీక్షలకు రెగ్యులర్, ఓపెన్ స్కూల్ విద్యార్థులు ఫీజు చెల్లించాలని జిల్లా విద్యాశాఖ అధికారి జి.కృష్ణప్ప తెలిపారు. ఎలాంటి అపరాధ రుసుము లేకుండా 9వ తేదీ లోపు చెల్లించవచ్చన్నారు. రెగ్యులర్ విద్యార్థులు అన్ని సబ్జెక్టులకు రూ. 125, ఒకేషనల్ విద్యార్థులు ఫీజుతో పాటు అదనంగా రూ. 60 చెల్లించాలన్నారు. అపరాధ రుసుము రూ. 50తో ఈనెల 12వ తేదీ, రూ. 200 అపరాధ రుసుముతో 15వ తేదీ, రూ. 500 అపరాధ రుసుముతో 18వ తేదీ లోపు చెల్లించవచ్చన్నారు. అన్ని ప్రభుత్వ, ప్రయివేటు పాఠశాలల విద్యార్థులు గడువులోపు పరీక్ష ఫీజు చెల్లించాలని సూచించారు.


విద్యార్థులకు సైకిళ్లు పంపిణీ చేసిన సత్యసాయి భక్తులు

సత్యసాయి భక్తుల సేవా కార్యక్రమాలు

ప్రజాశక్తి-కొత్తచెరువు

సత్యసాయి శతజయంతి ఉత్సవాల సందర్భంగా ఆదివారం ఆయన భక్తులు పలు సేవా కార్యక్రమాలు నిర్వహిచారు. వారిలో లండన్‌కు చెందిన సాయిదాం సహకారంతో స్థానిక ఆర్‌డిటి కార్యాలయం, పుట్టపర్తి దేవి నిలయం వద్ద ఉచిత వైద్య శిబిరాలు నిర్వహించారు. పేదలకు కంటి, దంత వైద్య పరీక్షలు చేసి అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేశారు. అలాగే లండన్‌కు చెందిన చంద్రశోద, అనిల్ సోద మహిళలకు కుట్టుమిషన్లు, విద్యార్థులకు సైకిళ్ళ, వికలాంగులకు వీల్ చైర్లు మొత్తం రూ. 5 లక్షల విలువ చేసే సామగ్రిని అందజేశారు. పుట్టపర్తి సమీపంలోని గుడారాల్లో నివసించే ప్రజలకు రూ. 4 లక్షల విలువ చేసే కుక్కర్లు, స్టవ్‌లు, పిల్లలకు ఆట వస్తువులు, దుస్తులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు లక్ష్మీనారాయణ, సేవాదళ్ సభ్యులు సాయిరామ్‌రెడ్డి, ఆదినారాయణ, కేశవరెడ్డి, నాగభూషణం, పాల్గొన్నారు.

కోలాటం ఆడుతూ కుప్పకూలి వ్యక్తి మృతి

ప్రజాశక్తి-మడకశిర టౌన్

భక్తరహళ్లి లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం ఆలయం ముందు ఉప్పరపల్లి కోలాటం బృందం కోలాట ఆడారు. ఆ సమయంలో కోలాటం ఆడుతున్న నాగరాజు(55) ఉన్నఫళంగా గుండెపోటుతో కుప్పకూలి అక్కడికక్కడే మృతి చెందాడు. దీంతో గ్రామంలో విషాద ఛాయలు అలముకున్నాయి. కోలాటంకు నాయకత్వం వహిస్తూ ఎంతోమందికి కోలాటం నేర్పిస్తూ ప్రదర్శిస్తున్న నాగరాజు మృతి పట్ల పలువురు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. 5 నెలల క్రితం ఆయన భార్య పిడుగుపాటుతో మృతి చెందింది.

జనసేనపార్టీని బలోపేతం చేద్దాం

ప్రజాశక్తి-పరిగి


కార్యక్రమంలో మాట్లాడుతున్న జనసేన నాయకుడు అమర్‌నాథ్

జనసేన పార్టీని గ్రామ స్థాయి నుంచి బలోపేతం చేద్దామని ఆ పార్టీ మండల కన్వీనర్ సురేష్ తెలిపారు. స్థానిక ఆర్యవైశ్య కళ్యాణ మండపంలో ఆదివారం సురేష్ ఆధ్వర్యంలో కార్యకర్తల ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ జనసేన పార్టీని బలోపేతం చేసేందుకు గ్రామ, మండల స్థాయి కమిటీలు ఏర్పాటు చేస్తున్నామన్నారు. అందులో భాగంగా ప్రతి గ్రామంలో పర్యటిస్తామని తెలిపారు. సీనియర్ నాయకులు ఎస్ఎంసి ఛైర్మన్ అశ్వర్థనారాయణ, అమర్‌నాథ్ మాట్లాడుతూ గ్రామంలో నెలకొన్న ప్రజా సమస్యలను కూటమి నాయకులు అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేయాలని సూచించారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల నాటికి మండల కమిటీలు పూర్తి చేసే దిశగా అధిష్టానం అడుగులు వేస్తుందన్నారు. పార్టీ కోసం కష్ట పడి పనిచేసిన ప్రతి ఒక్కరినీ గుర్తించే విధంగా కమిటీలు ఏర్పాటు చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో మండల నాయకులు రవితేజ, రంగప్ప, బీరలింగప్ప, మధు, తిప్పేస్వామి, నవీన్, బాలచంద్ర, అనిల్, అధిక సంఖ్యలో కార్యకర్తలు పాల్గొన్నారు.

సిఎం చంద్రబాబు చిత్రపటానికి పాలాభిషేకం


ప్రజాశక్తి-పుట్టపర్తి రూరల్


సిఎం చంద్రబాబు చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న వికలాంగులు

విభిన్న ప్రతిభావంతుల దినోత్సవం సందర్భంగా ఆదివారం పట్టణంలోని గణేష్ కూడలిలో ఎపి వికలాంగుల హక్కుల పోరాట సమితి ఆధ్వర్యంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. అలాగే కూటమి ప్రభుత్వానికి, సిఎం చంద్రబాబు, విద్యా శాఖ మంత్రి నారా లోకేష్‌కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో టిడిపి జిల్లా నాయకులు నాయకులు సామకోటి ఆదినారాయణ, ఎపి వికలాంగుల హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షులు పిఎండి షఫీ, జిల్లా అధ్యక్షులు ఎంకె.రామాంజనేయులు, ప్రధాన కార్యదర్శి నారాయణ, ఉపాధ్యక్షులు గోపాల్‌నాయక్, భూదేవి, మండల కన్వీనర్లు మారుతీఈశ్వర్, గజేంద్ర, వీరేష్, ధనుంజయ, గంగాద్రి, జానకిరామయ్య, ఆంజనేయులు, వెంకటరాముడు, పాలాభిషేకం కార్యక్రమంలో పాల్గొన్నారు.

వాల్మీకి ఉద్యోగుల ఆత్మీయ సమ్మేళనం

ప్రజాశక్తి-ధర్మవరం రూరల్


సమావేశమైన వాల్మీకి ఉద్యోగులు

స్థానిక ఎన్‌జిఒ హోంలో ఆదివారం వాల్మీకి ఉద్యోగుల ఆత్మీయ సమావేశం నిర్వహించారు. అందులో భాగంగా రాష్ట్ర, జిల్లా బాధ్యుల సమక్షంలో నియోజకవర్గ కార్యవర్గంతో పాటు డివిజన్ పరిధిలో ఉన్న వివిధ మండలాల కార్యవర్గాలను ఎన్నుకున్నారు. అలాగే వాల్మీకుల ఎస్టీ పునరుద్ధరణ అంశంపై తీర్మానం చేశారు. నియోజకవర్గ అధ్యక్షులుగా బి.నరసింహులు, ప్రధాన కార్యదర్శిగా చంద్రశేఖర్, కోశాధికారిగా జె.భాస్కర్, గౌరవాధ్యక్షులుగా వెంకటశివలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. రాష్ట్ర నాయకులు బి.ఈశ్వరయ్య, ముత్యాలప్ప, శివయ్య, సోమశేఖర్, బి.జగదీష్, జిల్లా అధ్యక్షులు బి.నారాయణస్వామి, ప్రధాన కార్యదర్శి బి.సూర్యనారాయణ, కోశాధికారి రామకృష్ణ, గౌరవాధ్యక్షులు వెంకటేష్, జెన్నే నాగప్ప, బి.నాగరాజు, చెన్నుడు, టి.వెంకటేశ్, పి.మాధవరాజు, రమేష్, జి.నాగప్ప, ఆంజనేయులు, నాగరాజు, ప్రసాద్, వారాదప్ప, బాలరాజు, కొండన్న, ఈశ్వరయ్య, ఓంప్రకాష్, రామాంజనేయులు పాల్గొన్నారు.

మాదక ద్రవ్యాల నియంత్రణపై అవగాహన

ప్రజాశక్తి-ధర్మవరం రూరల్



మాదక ద్రవ్యాల నియంత్రణపై అవగాహన కల్పిస్తున్న ప్రిన్సిపల్

మాదక ద్రవ్యాల నియంత్రణపై రూరల్ పరిధిలోని పోతుకుంట గ్రామంలో ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు, విద్యార్థులు ప్రజలకు అవగాహన కల్పించారు. పట్టణం లోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో గ్రామంలో వారం రోజుల నుంచి ప్రత్యేక శిబిరం నిర్వహించారు. చివరి రోజైన ఆదివారం ప్రిన్సిపల్ జెవి.సురేష్‌బాబు, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ మల్లికార్జున మార్గనిర్దేశంలో వాలంటీర్లు ప్రజలకు మాదక ద్రవ్యాల నియంత్రణపై అవగాహన కల్పించారు. వారు ఇంటింటికీ వెళ్లి డ్రగ్స్, గుట్కా, మద్యం, తదితర మత్తు పదార్థాలు వ్యక్తి, కుటుంబం, సమాజంపై కలిగించే దుష్ప్రభావాలను ప్రజలకు వివరించారు. అనంతరం వాలంటీర్లు ప్రదర్శించిన స్కిట్స్, సంప్రదాయ నృత్యాలు, సాంస్కృతిక కార్యక్రమాలు ప్రజల్లో చైతన్యం నింపాయి. హాజరైన డిప్యూటీ ఎంపిడిఒ వెంకటేష్, హెచ్ఎం వేణుగోపాలా చార్యులు, పంచాయతీ కార్యదర్శులు రామగౌని, మురళీగౌడ్, భాస్కర్, సర్పంచి అంగజాల నాగవేణి, రాజశేఖర్ వాలంటీర్లను అభినందించారు.

ఏర్పాట్లు పరిశీలన

ప్రజాశక్తి-కదిరి టౌన్

పట్టణంలోని కొత్త బైపాస్ రోడ్డులో అనంతపురం, హిందూపురం జిల్లాల ఇస్తేమా ఈ నెల 27, 28 తేదీల్లో నిర్వహించనున్నారు. దీంతో ఆ ఏర్పాట్లను ఆదివారం ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ ముస్లిం మత పెద్దలతో పరిశీలించారు. మైదానంలో వసతులను పరిశీలించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ఇస్తేమా విజయవంతంగా నిర్వహించేందుకు ప్రభుత్వం ద్వారా సహాయ సహకారాలు అందిస్తామని తెలిపారు. ఆయన వెంట మున్సిపల్ కమిషనర్, డీఎస్పీ, టౌన్ సిఐ, నిర్వాహకులు ఉన్నారు.


విరాళం అందజేస్తున్న బాలాజీ రాయల్

శ్రీకృష్ణదేవరాయల విగ్రహ ఏర్పాటుకు విరాళం

ప్రజాశక్తి-గోరంట్ల

పట్టణంలోని బస్టాండ్ వద్ద శ్రీకష్ణదేవ రాయలు విగ్రహాన్ని ఏర్పాటుచేయనున్నారు. ఈ క్రమంలో పిల్లర్ నిర్మాణ పనులకు ఆదివారం మండలంలోని కమ్మవారిపల్లి పంచాయతీ చుండూరువాండ్లపల్లికి చెందిన డాన్స్ కిష్టప్ప కుమారుడు బాలాజీ రాయల్ రూ. 10,116, బెల్లం కృష్ణయ్య కుమారుడు చిన్నా రాయల్ రూ. 5,116 విరాళం అందజేశారు.


కెజిబివి హాస్టల్‌ను తనిఖీ చేస్తున్న అధికారి

కెజిబివి హాస్టల్ తనిఖీ

ప్రజాశక్తి-గాండ్లపెంట

స్థానిక కస్తూర్బా గాంధీ బాలికల విదాయలయ(కెజిబివి) వసతి గృహాన్ని ఆదివారం సమగ్ర శిక్ష అభియాన్ అకడమిక్ మానిటరింగ్ ఆఫీసర్ అబ్దుల్ మాలిక్ బాషా తనిఖీ చేశారు. కెజిబివి విద్యార్థినులతో పనులు చేయిస్తున్నారని ఓ వీడియో సామాజిక మాధ్యమాల్లో వైరల్ అయింది. దీంతో కెజిబివి వసతి గృహాన్ని సందర్శించి ఆ సంఘటనపై విచారణ చేపట్టారు. వార్డెన్ జ్యోష్ణ మాట్లాడుతూ ఆ వీడియో పాతది అని తెలిపారు. వసతి గృహం ప్రారంభించిన సమయంలో సిబ్బందిని నియమించపోవడం, వంట మనిషికి ఆరోగ్యం బాగా లేకపోవడంతో ఆ సమయంలో మేమే కూరగాయలు తరగడం, తదితర పనులు చేశామన్నారు. వార్డెన్, విద్యార్థినులు తెలిపిన వివరా లతో ఎపిసికి నివేదిక అందజేస్తామని తెలిపారు.

కెజిబివిలో విద్యాసామగ్రి పంపిణీ

ప్రజాశక్తి-లేపాక్షి

స్థానిక కెజిబివి పాఠశాల, కళాశాల విద్యార్థినులకు ఆదివారం కృతి ఫౌండేషన్ ఆధ్వర్యంలో 120 అట్టలు, 5 ఫ్యాన్లు అందజేశారు. ఫౌండేషన్ సభ్యులు గోవర్ధన్, సుధాకర్ సామగ్రిని పాఠశాల ప్రిన్సిపల్ నీలిమకు అందజేశారు. రాబోయే రోజుల్లో మరిన్ని సేవా కార్యక్రమాలు చేస్తామని వారు వెల్లడించారు. విద్యార్థులు బాగా చదువుకోవాలన్నారు. కృతి ఫౌండేషన్ సభ్యులకు పాఠశాల సిబ్బంది కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయ బృందం, విద్యార్థినులు పాల్గొన్నారు.



పాఠశాలకు అట్టలు, ఫ్యాన్లు అందజేస్తున్న కృతి ఫౌండేషన్ సభ్యులు

సింగేపల్లి వద్ద కృష్ణా జలాలకు హారతి

ప్రజాశక్తి-గుడిబండ

మండలంలోకి కృష్ణా జలాలు రావడం పట్ల రైతులు, ప్రజలు, ప్రజాప్రతినిధులు, నాయకులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. పలువురు రైతులు, నాయకులు ఆదివారం కృష్ణా జలాలకు హారతులు పట్టి పూజలు చేశారు. తమ ప్రాంతానికి నీరు తెచ్చినందుకు సిఎం చంద్రబాబు, ఎమ్మెల్యే ఎంఎస్.రాజు, టిడిపి రాష్ట్ర ఉపాధ్యక్షులు గుండుమల తిప్పేస్వామి, రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ శ్రీనివాస్‌మూర్తి, కూటమి ప్రభుత్వానికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. టిడిపి మండల నాయకులు, రైతులు మాట్లాడుతూ ఎమ్మెల్యే రాజు, మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి ప్రత్యేక చొరవతోనే మారుమూల గ్రామమైన అమరాపురం వరకూ కృష్ణా జలాలు వచ్చాయని తెలిపారు. త్వరలోనే అమరాపురంతో పాటు మడకశిర నియోజకవర్గంలోని అన్ని చెరువులను కృష్ణా జలాలతో నింపుతారని ఆశాభావం వ్యక్తం చేశారు. అనంతరం వారు సింగేపల్లి గ్రామం వద్ద కృష్ణా జలాలకు హారతి ఇచ్చి, గంగపూజ చేశారు. కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షులు లక్ష్మీనరసప్ప, సింగిల్‌విండో అధ్యక్షులు మద్దనకుంటప్ప, న్యాయవాది శివకుమార్, జయరామప్ప, షబ్బీర్, పుట్టలింగప్ప, జయన్న, రామప్ప, జనార్ధన్, సత్యప్ప, జగదీష్, కిష్టప్ప, శివకుమార్, మల్లికార్జునప్ప, దేవరాజ్, రవికుమార్, ఈరన్న, ప్రజలు పాల్గొన్నారు.

బ్రహ్మోత్సవాల్లో యథేచ్ఛగా మద్యం అమ్మకాలు

భక్తుల పెదవి విరుపు

ప్రజాశక్తి-మడకశిర టౌన్

జిల్లాలో ప్రసిద్ధి చెందిన భక్తరహళ్లి బ్రహ్మోత్సవాల్లో మద్యం ఏరులై పారిందన్న విమర్శలు ఉన్నాయి. ఆలయ పవిత్రతను కాపాడాల్సిన అధికారులే అపవిత్రం చేశారని పలువురు పేర్కొంటున్నారు. బ్రహ్మోత్సవాలు జరిగిన రోజుల్లో మద్యం అమ్మకాలు యథేచ్ఛగా సాగించారు. బ్రహ్మోత్సవాల సమయంలో అవాంఛనీయ సంఘటనలు జరగకుండా గట్టి బందోబస్తు ఏర్పాటు చేసినా పోలీసులు మద్యం విక్రయాలను అరికట్టలేక పోయారు. పదేళ్ల క్రితం అల్లరి మూకలు మద్యం తాగి వృద్ధురాలిపై అత్యాచారానికి పాల్పడిన ఘటన నేపథ్యంలో అప్పటి నుంచి బ్రహ్మోత్సవాల్లో మద్యం అమ్మకాలను ఎక్సైజ్ అధికారులు కట్టుదిట్టం చేసేవారు. కానీ నేడు అందుకు విరుద్ధంగా భక్తరహళ్లి, జిల్లేడుగుంట గ్రామాల్లో జోరుగా మద్యం విక్రయించడం, జాతర నిర్వహించే హారేసముద్రం, వైబి హళ్లి గ్రామ పంచాయతీల్లో అనధికార బెల్ట్ షాపులు ఏర్పాటు చేయడంపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. జాతర సందర్భంగా మద్యం అమ్మకాలపై నిషేధాలు విధించాల్సిన, పర్యవేక్షించాల్సిన అధికారులు కనీసం అటువైపు కన్నెత్తి కూడా చూడకపోవడం గమనార్హం.

క్రికెట్ పోటీల్లో ధర్మవరం జట్టు విజయం

ప్రజాశక్తి-ధర్మవరం రూరల్

పట్టణంలోని ఆర్‌డిటి క్రీడా మైదానం లో జరుగుతున్న జిల్లా రూరల్ క్రికెట్ పోటీల్లో భాగంగా ఆదివారం ధర్మవరం రూరల్, హిందూపురం రూరల్ జట్లు తలపడ్డాయి. టాస్ గెలిచిన హిందూపురం జట్టు బౌలింగ్ ఎంచుకుంది. ధర్మవరం జట్టు 40 ఓవర్లలో 242/10 స్కోర్ చేసింది. బ్యాటింగ్‌లో టి.గణేష్ 89(98 బంతులు), సి.జావిద్ 43(30 బంతులు), కుందన్ 31(27 బంతులు) పరుగులు చేశారు. అనంతరం బ్యాటింగ్ చేసి హిందూపురం రూరల్ జట్టు 187 పరుగులకు ఆలౌట్ అయింది. చరణ్ 50(51 బంతులు) పరుగులు చేశాడు. ధర్మవరం బౌలర్లలో ఎం.కుందన్ 3,టి.సాయి సంతోష్ 2 వికెట్లు తీశారు. ఆస్ట్రో ఫ్యాషన్ యజమాని హరి రెండు జట్ల ఆటగాళ్లకు భోజనం ఏర్పాటు చేశారు. భారత క్రికెట్ ఆటగాడు శిఖర్ ధావన్ అభిమాని శంకర్ ధావన్ ఎం.కుంధన్‌కు ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డు, గణేష్‌కు స్పోర్ట్స్ టీషర్టు అందజేశారు. మ్యాచ్ తర్వాత ఆర్‌డిటి ఏరియా ప్రోగ్రామ్ కోఆర్డినేటర్ శ్రీనివాసులు, క్రికెట్ కోచ్ రాజశేఖర్ ఇరు జట్లను అభినందించారు.



ట్రాక్టర్ బోల్తా.. యువకుడు మృతి

ప్రజాశక్తి-గుడిబండ

ట్రాక్టర్ బోల్తా పడి ఓ యువకుడు మతి చెందిన సంఘటన మండలంలోని సిసి గిరి గ్రామంలో చోటుచేసుకుంది. వివరిలు.. సిసి గిరి గ్రామానికి చెందిన ఎంజేరప్ప(34) బెంగళూరులో నగరంలోని ఓ ప్రయివేట్ కంపెనీలో పని చేస్తున్నాడు. భార్య, పిల్లలతో కలిసి శనివారం స్వగ్రామమైన సిసి గిరి వచ్చారు. ఆదివారం మడకశిర మండలంలోని కోతలగుట్ట గ్రామంలో ఉన్న వారి బంధువుల ఇంటికి వెళ్లాడు. కోతులగుట్టకు చెందిన మల్లికార్జునతో కలిసి వ్యవసాయ పనుల వద్దకు ట్రాక్టర్‌లో వెళ్లాడు. అయితే ట్రాక్టర్ అదుపుతప్పి బోల్తా పడడంతో ఎంజేరప్ప అక్కడికక్కడే మృతి చెందగా మల్లికార్జునకు తీవ్రగాయాలయ్యాయి. ఎంజేరప్ప మృతితో భార్య, తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు బోరున విలిపించారు. ఎంజేరప్పకు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. మృతుని కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

పేకాట జూదరులు అరెస్టు

ప్రజాశక్తి-గాండ్లపెంట

పేకాట స్థావరంపై దాడి చేసి జూదరులను అదుపులోకి తీసుకుని నగదు, సెల్‌ఫోన్లు, బైక్‌లు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ క్రాంతి తెలిపారు. వివరాలు.. అందిన సమాచారం మేరకు ఆదివారం ఎస్ఐ క్రాంతి, సిబ్బంది మండలంలోని కటారుపల్లి పంచాయతీలోని సాదలవాండ్రపల్లి అటవీ ప్రాంతంలో నిర్వహిస్తున్న పేకాట స్థావరంపై దాడి చేశారు. జూదరులను అదుపులోకి తీసుకుని వారి నుంచి 12 సెల్‌ఫోన్లు, 11 ద్విచక్ర వాహనాలు, రూ. 8,400 నగదు స్వాధీనం చేసుకొని వారిపై కేసు నమోదు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు. దాడుల్లో జమేదారు రామ్మోహన్, భాస్కర్, రాజు, నరసింహా, తదితరులు పాల్గొన్నారు.


పోలీసులు అరెస్టు చేసిన జూదరులు